క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంఈవోగా శ్రీనివాసరెడ్డి



మాచవరం: మాచవరం మండల ఇన్‌చార్జి విద్యా శాఖాధికారిగా ఎ.శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేసిన బి.రాజకుమారి సెలవుపై వెళ్లడంతో మండలంలోని మోర్జంపాడు జీవీజీకేఆర్వో హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని ఇన్‌చార్జి ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని చెప్పారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



గురజాల: సీపీఐ నాయకుడు, పత్రికా విలేకరి యేచూరి లక్ష్మీనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు. స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో లక్ష్మీనారాయణ కుమారుడు మణి ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ పోరాట నాయకుడని వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ షేక్ బడేజానీ, ఏపీపీ బండి వీరభద్రుడు, సీపీఐ నాయకుడు షేక్ హుస్సేన్, విలేకరులు నారాయణభట్లు సుబ్రమణ్యం, బి.అలరాజు, నాగులుమీరా, కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

వెంకట్రావు సేవలు చిరస్మరణీయం



పెదకూరపాడు: పేదల కోసం తన సొంత నిధులను వెచ్చించిన మహోన్నత వ్యక్తి నెలకుదిటి వెంకట్రావు అని జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్, మాజీ ఎంపీపీ నెలకుదిటి వీరవెంకట వరప్రసాద్ (బుజ్జి) అన్నారు. పెదకూరపాడులోని పంచాయతీ కార్యాలయం వద్ద వెంకట్రావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రామగోపాలరావు మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటూ సేవలు చేసిన వెంకట్రావు చిరస్మరణీయులు అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జి.బాబూరావు, 75 త్యాళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు శివరామకృష్ణయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఎస్సీ సెల్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



సత్తెనపల్లి: ఏకలవ్య జయంతి వేడుకలు సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏకలవ్య విగ్రహానికి గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు పూల మాలలు వేసి, నమస్కరించారు. స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిత్రకారుడు వజ్రగిరికి సత్కారం



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు గౌరవ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా గుమ్మడి వృద్ధాశ్రమంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రగిరి జెస్టిస్ గీసిన చిత్రాల గురించి పలువురు కొనియాడారు. అనంతరం జెస్టిస్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మారుతి వరప్రసాద్, న్యాయవాది రామ్మోహనరావు, కవి కరిముల్లా, యూటీఎఫ్ నాయకులు నాగేంద్రుడు, అప్పరాజు నాగేశ్వరరావు, గుమ్మడి, సద్దాం, అంజి, స్టార్ వలి, బాజీ, సుభాని పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

పలు చోట్ల ఘనంగా మొహర్రం వేడుకలు



పీర్లచావిడి వద్ద అగ్నిగుండం చుట్టూ తిరుగుతున్న పీర్లు

పిడుగురాళ్ల: త్యాగానికి ప్రతీక మొహర్రం అని ముస్లిం మత పెద్దలు అన్నారు. పట్టణంలోని మాయ బజారు సెంటర్‌లోని పీర్లచావిడి వద్ద ముస్లింలు ఘనంగా మోహర్రం వేడుకలను నిర్వహించారు. హుస్సేన్, హుస్సేన్ పీర్లతో పాటు మిగిలిన పీర్లు షహీదు అయ్యాయి. త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండగను కులమతాలకు అతీతంగా అందరూ కలసిమెలిసి జరుపుకోవడం విశేషం. పదో షరగత్ పురస్కరించుకొని పట్టణంలోని పీర్లచావిడి వద్ద పీర్లతో ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు విశేషంగా హాజరై తిలకించారు.

అమరవీరుల త్యాగమే మొహర్రం

మొహర్రం పర్వదినాన అమరవీరుల హుస్సేన్, హుస్సేన్ త్యాగాలను స్మరించుకోవటం. 14 దశాబ్దాల క్రితమే ప్రజాస్వామ్యం కోసం, మానవ హక్కుల కోసం జరిగిన చారిత్రక పోరాటానికి నిదర్శనమే మొహర్రం. మొహర్రం మాసం నెల పొడుపు చూడగానే పీర్లచావిడిలోని పీర్లను ఏర్పాటు చేస్తారు. నెల పొడుపు కనిపించినప్పటి నుంచి 5వ రోజు, 7వ రోజు, 10వ రోజు.. ఇలా మూడు షరగతులుగా మొహర్రం పండగను నిర్వహిస్తారు. 11వ రోజు షహీద్ (మరణించిన) హుస్సేన్, హుసేన్ త్యాగాలకు ప్రతీకగా పీర్లను మూటకట్టి తీసుకొని వెళ్తారు. ఈ ఘట్టానికి కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు హాజరవుతారు. పీర్లచావిడి వద్ద నిప్పుల గుండంలో పీర్లు పట్టిన వారు పీర్లతో నడవటం నిర్వహించారు. మహిళలు పీర్లతో, చంకీలతో కూడి సీరాలను ఏర్పాటు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. మొహర్రంను పది రోజులు విషాద దినాలుగా నిర్వహిస్తారు. అమరవీరులైన హుస్సేన్, హుస్సేన్‌లకు అల్విదా... అల్విదా అంటూ చనిపోయిన పీర్లను సాగనంపి ముగిస్తారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు.

మాచవరంలో...

మాచవరం: త్యాగాలకు ప్రతీక మొహర్రం పండగని, నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలకు గుర్తుగా ఈ పండగని జరుపుకోవడం జరుగుతుందని పలువురు ముస్లిం సోదరులు పేర్కొన్నారు. మండలంలోని మాచవరం, గంగిరెడ్డిపాలెం, రేగులగడ్డ, వేమవరం, మోర్జంపాడు, శ్రీరుక్మిణీపురం, పిల్లుట్ల గ్రామాల్లో పీర్ల పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ముజావర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవం పట్ల భయభక్తులతో పాటు, ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణ, సేవాభావం కలిగి ఉండాలన్నారు. పీర్ల చావిళ్ల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



పీర్లను మూటకట్టి తీసుకొని వెళ్తున్న దృశ్యం

రెంటచింతలలో...

రెంటచింతల: మండలంలోని పశర్లపాడు, మిట్టగుడిపాడు, పాలువాయి, తుమ్మకోట, మంచికల్లు, రెంటచింతల తదితర గ్రామాలలో బుధవారం మొహర్రం వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మొహర్రం నెల ముస్లింలకు మతపరంగా, చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినది. ఇది అల్లాహ్ పవిత్రమైనదిగా నిర్ణయించిన 41 రోజుల నుంచి జరుగుతున్న ఈ మొహర్రం వేడుకలలో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి వీరోచిత ప్రాణ త్యాగం చేసిన దైవప్రవక్త మహమ్మదు మనమలు అయిన యోధులు హుసేన్, అసాన్‌లను స్మరించుకుంటూ వారి ఆత్మ శాంతి కోసం ముస్లింలు జరుపుకునే అత్యంత పర్వదినమే మొహర్రం అని మత పెద్దలు బోధించారు. ఎంతో నిష్ఠతో భక్తితో ప్రతి ముస్లిం సంతాప దినాలు పాటించి శనగపప్పు, బొరుగులు, పెరుగన్నం భక్తులకు పంపిణీ చేశారు.

గురజాలలో....

గురజాల: పవిత్ర యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వారి త్యాగాల్ని గుర్తు చేసుకుంటూ ముస్లింలు మొహర్రం పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని పీర్లచావిడి వద్ద ప్రత్యేకంగా పీర్లను అలంకరించి.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పీర్లకు వార్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అంగరంగ వైభవంగా పీర్ల పండగను నిర్వహించారు. ముస్లింలు ఒకరికి ఒకరు మొహర్రం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లు



మిట్టగుడిపాడులో ఏర్పాటు చేసిన పీర్లు



పీర్లకు మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

ప్రతి సోమవారం సచివాలయాల్లో 'పీజీఆర్ఎస్'

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్



మాచర్ల: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయం, సచివాలయాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు (పీజీఆర్ఎస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిధిలో ప్రజలకు సంబంధించి ప్రతి అర్జీ స్వీకరించాలన్నారు. అలాగే ఆ సమస్యలను బుధవారం లోపు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అన్ని విభాగాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్ పేరుతో వేదిక ఏర్పాటు చేసిందని వెల్లడించారు. సచివాలయ ఉద్యోగులు సచివాలయ పరిధిలో ప్రజల సమస్యలపై నివేదిక తయారు చేసి ఆయా సెక్షన్ హెడ్‌లకు పంపించాలన్నారు. సమస్యలన్నింటినీ 24 గంటల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే సోమవారం నుంచి కచ్చితంగా అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సచివాలయ ఉద్యోగులు, అడ్మిన్‌లు సమష్టిగా కృషి చేయాలన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం జులై 23 నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆధార్ క్యాంపు నిర్వహించేందుకు బుధవారం సర్క్యులర్‌ను విడుదల చేసిందని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ తెలిపారు. 23 నుంచి 27వ తేదీ వరకు సచివాలయ పరిధిలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీస్‌లు అప్‌డేట్, కొత్త ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్, ఆధార్ అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. మొత్తం క్యాంపులో 109కిపైగా సర్వీసులు చేయడం జరుగుతుందన్నారు. క్యాంపు పరిధిలోని ప్రజలు ఈ ఆధార్ క్యాంపును వినియోగించుకోవాలని కోరారు.



అధ్వానంగా ఉన్న తంగెడ రోడ్డు

గుంతల రోడ్లు.. ప్రజల ఇక్కట్లు

దాచేపల్లి : నరకానికి మార్గాలుగా రోడ్లు దర్శనమిస్తున్నాయి. చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారుతున్నాయి. రోడ్లపై భారీ స్థాయిలో గుంతలు ఏర్పడటం వలన వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల సాగును చూసి జనం నివ్వెరపాతున్నారు. రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టకపోవటంతో రాకపోకలు సాగించటం ఇబ్బందిగా మారింది. దాచేపల్లి-తంగెడ, దాచేపల్లి-కారంపూడి రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



గుంతలమయంగా ఉన్న దాచేపల్లి-కారంపూడి రోడ్డు

అసలే వర్షాకాలం..
పారిశుద్ధ్య చర్యలు శూన్యం

- ప్రధాన రహదారిపై దర్శనమిస్తున్న వ్యర్థాలు
- ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు, చెట్లు
- బీఎస్ఎన్ఎల్ టవర్ ప్రాంతంలో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

మాచర్ల రూరల్: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుదలలో లోపం కనిపిస్తుంది. ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో పేరుకున్న చెత్తతో పశువుల కొట్టంగా మారింది. రహదారిపైనే ఆవులు అడ్డంగా పడుకోవటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాలు వ్యర్థాలకు నిలయంగా మారి వ్యాధులకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. పట్టణంలోని 13, 14 వార్డులలో రామాటాకీస్ వెనుక ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్త, చెదారం, ప్లాస్టిక్ ఇష్టానుసారం పడవేస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. నివాస గృహాలు మధ్య బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేయకూడదని.. మంచి పద్ధతి కాదని తెలిసినా కొంత మంది ఇష్టానుసారంగా వేస్తున్నారు. 14వ వార్డులోని బీఎస్ఎన్ఎల్ టవర్ ఖాళీ స్థలంలో ఏపుగా చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తుంది. ఈ ప్రాంతంలో నివసించే ప్రజలు ఆ ఖాళీ స్థలాల నుంచి వచ్చే పురుగు పుట్రతో తీవ్ర ఇబ్బందులు పడుతుండటమే కాకుండా వర్షాకాలంలో నీరు నిలిచి అంటు వ్యాధులకు గురవుతున్నారు. ఖాళీ స్థలంలో చుట్టుపక్కల నివాసించే వారు కుళ్లిన ఆహార పదార్థాలు, వ్యర్థాలు వేయటం వలన తీవ్రమైన దుర్వాసనతో పాటు క్రిమి కీటకాలు చేరటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురికి కాలువలలో తీసిన మురుగును రోడ్డుపై వదిలివేస్తున్నారు. దీని వలన కూడా వాసన రావటం, దోమలు పెరగటం జరుగుతుంది. పందులు, కుక్కలు విచ్చలవిడిగా సంచరించటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలాలలో పడవేసిన చెత్త, చెదారం.. మొలచిన చెట్లు తొలగించకపోతే దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముంది. అసలే వర్షాకాలం.. దోమలు వ్యాప్తి చెందితే వ్యాధులు ప్రబలే అవకాశముందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పట్టణ, గ్రామాలలో డయేరియా వంటి వ్యాధులతో ప్రజలు మంచాన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పురపాలక శాఖాధికారులు స్పందించి ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి చెత్తను, చెట్లను తొలగించి తగు రక్షణ ఏర్పాట్లు చేయాలని, అలాగే బీఎస్ఎన్ఎల్ టవర్ ప్రాంతంలో చిట్టడవిని తలపిస్తున్న పిచ్చి చెట్లను తొలగించి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.




ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త, ఆవులు మేస్తున్న దృశ్యం



చెట్లతో నిండిపోయిన ఖాళీ స్థలం

వంతెనలు శిథిలం.. ప్రమాదంలో ప్రయాణం!





శిథిలావస్థకు చేరిన నందిరాజుపాలెం, చంద్రాజుపాలెంలోని వంతెనలు

బొల్లంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో కాలువలు, రహదారులపై ఉన్న వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. నందిరాజపాలెం, మాచాయపాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామాల మీదుగా చింతపల్లి మేజరు కాలువ ప్రవహిస్తోంది. దీంతో పలు గ్రామాలకు కాలువపై తొమ్మిది వంతెనలను నిర్మించారు. ఇవి శిథిలావస్థకు చేరాయి. మరీ ముఖ్యంగా చంద్రాజుపాలెం నుంచి బ్రహ్మంగారి మఠం వైపుగా రోడ్డులో కాలువపై నిర్మించిన వంతెన, నాగిరెడ్డిపాలెం - నందిరాజుపాలెం రహదారిపై వంతెన శిథిలావస్థకు చేరి కుంగిపోయేలా ఉన్నాయి. చంద్రాజుపాలెం వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. నీళ్లు ప్రవహించే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల బస్సులు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

మాచర్ల: తొలి ఏకాదశి పురస్కరించుకుని పట్టణంలోని పలు దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందూ సంప్రదాయం ప్రకారం తొలి ఏకాదశికి ప్రత్యేకత ఉంది. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి దేవాలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్, పాతూరు, నెహ్రూనగర్‌లలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాలతో పాటు చెన్నకేశవస్వామి దేవాలయంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పాతూరులోని శివాలయం, వీరభద్రస్వామి దేవాలయం, రామప్పదేవాలయంతోపాటు, పలు దేవాలయాల్లో తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు.

మాచవరంలో తొలి ఏకాదశి

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశిని ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకొని పూజలు చేపట్టారు. మోర్జంపాడులోని బుగ్గ మల్లేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పూజారులు తొలి ఏకాదశి విశిష్ఠతను, స్వామి వార్ల దర్శనంతో కలిగే పుణ్యఫలాలను భక్తులకు వివరించారు.

ఎత్తిపోతలలో ఘనంగా తొలి ఏకాదశి

విజయపురిసౌత్: మాచర్ల మండలం ఎత్తిపోతలలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దత్తాత్రేయస్వామి, రంగనాథస్వామి దేవాలయాలలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు దత్తకుమార్ శర్మ, రంగాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల భక్తులు ఎత్తిపోతలకు భారీగా తరలివచ్చారు. భక్తులు దేవాలయ ప్రాంగణంలోని దిగువ ఎత్తిపోతలలో స్నాన మాచరించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 10,000 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు భారీగా తరలిరావడంతో మాచర్ల రూరల్ సీఐ కె.సురేష్ పర్యవేక్షణలో విజయపురిసౌత్ ఎస్సై పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి సర్పంచ్ పసుపులేటి బ్రహ్మనాయుడు, ఆలయ ఈవో సాంబయ్య, భక్తులు పాల్గొన్నారు.



ఎత్తిపోతలలోని దత్తాత్రేయ స్వామి

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాలు బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా శివ నామస్మరణతో మారుమోగాయి. మండలంలోని గొట్టిపాళ్ళలో వేంచేసియున్న మార్కండేయ స్వామి దేవాలయంలో అర్చకులు దిడుగు శంకర. శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిరిగిరిపాడు శివాలయంలో యండపల్లి సుబ్బారావు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పలపాడులోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో మేడిపల్లి నరసింహయ్య మూర్తి శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు జరిగాయి. వెల్దుర్తి, గుండ్లపాడు, మండాది, పట్లవీడు, కండ్లకుంట గ్రామాలలోని శివాలయాలలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. వివిధ దేవాలయాలలో పులిహోర పంపిణీ చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకున్నారు.



మాచర్ల బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో...



మోర్జంపాడులోని బుగ్గ మల్లేశ్వరస్వామి



ఉప్పలపాడు మల్లికార్జున స్వామి దేవాలయంలో...



ఎత్తిపోతలలో తొలి ఏకాదశి వేడుకలలో భక్తులు

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

క్రోసూరు: మండలంలోని అందుకూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యారు. ఈ నెల 15వ తేదీ నుంచి అతడు కనిపించడం లేదని తండ్రి పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.షఫీ తెలిపారు. గ్రామానికి చెందిన కట్లగుంట వెంకట శివ (25) అదృశ్యమైన సమయంలో ఆకుపచ్చ చొక్కా, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నారు. 15న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96235, 08640- 227133 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



వెంకట శివ

వందేళ్ల వేప చెట్టుపై గొడ్డలి వేటు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో వందేళ్ల నాటి వేప చెట్టుపై గొడ్డలి వేటు పడింది. రంపాలతో ముక్కలుగా చేశారు. ఇక్కడ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా దానికి అడ్డొస్తుందేమోననే ఉద్దేశంతో వేప చెట్టును నరికివేశారు. ప్రధాన రహదారి నిర్మాణం సమయంలో కూడా ఈ చెట్టు జోలికి ఎవరు వెళ్లలేదు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేటప్పుడూ చెట్టు అడ్డంకిగా కాలేదు. కానీ ప్రస్తుతం చెట్టు మొత్తం నరికేసి చిన్న మోడు మిగిల్చారు. చెట్టు కింద చిరు వ్యాపారులు తోపుడు బండ్లు పెట్టుకునేవారు. ఎవరైనా తమ డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుత దీక్షలు, ధర్నాలు ఇక్కడే నిర్వహించేవారు. సాయంత్రం సమయంలో స్థానికులు ఆ ప్రాంతంలో సేద తీరేవారు. చెట్టును నరకడం చూసి ప్రతి ఒక్కరు జీర్ణించుకోలేక పోతున్నారు. బాధ్యులపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.